సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 7 । ఆగస్టు । 2023



డ్రాగా ముగిసిన జోనల్ మ్యాచ్

కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్టు డ్రాగా ముగిసింది. -8లో



కాసులు కురిపించే డ్రాగన్‌ఫ్రూట్

విదేశాల్లో సంపన్నులు తినే డ్రాగన్‌ఫ్రూట్ పంట రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. ఈ పంటను ములకలచెరువు మండలంలో సాగు చేస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1040	రూ.1160
రెండోరకం	రూ.900	రూ.1020



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 404 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	482	482
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 34.760 కిలోలు

న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా స్పందన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటనలో తెలిపారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

హార్సిలీహిల్స్‌కు విచ్చేసిన జస్టిస్ లక్ష్మణరెడ్డి



గౌరవ వందనం స్వీకరిస్తున్న లోకాయుక్త లక్ష్మణరెడ్డి

బి.కొత్తకోట: ఏపీ లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదివారం సాయంత్రం బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ చేరుకున్నారు. ఆయనకు విడిది ఏర్పాట్లు చేసిన గవర్నర్ బంగ్లా వద్దకు చేరుకోగానే పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం కొండపై ప్రకృతి అందాలను తిలకించారు. రాత్రికి ఇక్కడే బసచేసి సోమవారం ఉదయం 7 గంటలకు ఇక్కడి నుంచి కర్నూలుకు బయలుదేరి వెళ్తారు.

దూదేకులు రాజకీయంగా ఎదగాలి



సంఘసేవకులకు సన్మానపత్రం అందజేస్తున్న బాదుల్లా

కడప కోటిరెడ్డిసర్కిల్: దూదేకులు రాజకీయంగా ఎదిగినప్పుడు మాత్రమే సామాజిక గుర్తింపు గౌరవం లభిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ పేర్కొన్నారు. ఆదివారం కడపలోని ఎర్రముక్కపల్లిలోని దూదేకుల భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోప్రకాశం జిల్లాలోని గిద్దలూరు నియోజకవర్గంలో దూదేకులు ఎక్కువగా ఉన్నారన్నారు. షాదితోఫా పథకాన్ని దూదేకులకు వర్తింపచేయడానికి కృషి చేశామన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి సంఘం నాయకులు చెంద్రాయిడు,కుళాయప్ప, మహిళా నాయకులు రజియాబేగం, సజీనా తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన ప్రధానోపాధ్యాయుల సంఘం కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఆదివారం కడపలోని సీఎస్ఐ స్కూల్‌లో సీనియర్ హెచ్ఎం ఎస్ఎండీ జాఫర్ పర్యవేక్షణలో నిర్వహించారు ఈ సమావేశానికి రాష్ట్ర ప్రధానోపాధ్యాయ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు జీవీ నారాయణరెడ్డి హాజరయ్యారు. అనంతరం హెచ్ఎం సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా వెంకటసుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్‌రావు, ఆర్థిక కార్యదర్శిగా విజయ్‌భాస్కర్‌రెడ్డి రాష్ట్ర కౌన్సిలర్లుగా రాజశేఖర్, శ్రీనివాసులరెడ్డి, నాగాంజనేయులు, పెంచలయ్య, సహాధ్యక్షులుగా ఆపర్ణ, బాల అంకిరెడ్డి, నాగిరెడ్డి, సూర్యనారాయణ, సహ కార్యదర్శులుగా జాఫర్, ప్రతాప్‌రెడ్డి, రామక్రిష్ణయ్య, ఇమాం హుస్సేన్, హెడ్‌క్వార్టర్ కార్యదర్శిగా టీవీ రమణయ్య, మహిళా కార్యదర్శులుగా రత్నాదేవి, గిరికుమారి, ఆడిట్ కమిటి సభ్యులుగా రమణయ్య, సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్: ఆగస్టు 21, 22వ తేదీల్లో జరగనున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోంలో రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగుల పక్షపాతిగా నిలిచారని అన్నారు. అడగకుండానే 12వ పీఆర్సీ ప్రకటించారని అన్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

నమ్మకమే పెట్టుబడి

ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో టెస్టింగ్ చేస్తున్న శాస్త్రవేత్తలు



- అన్నదాతల సేవలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్స్
- విత్తనాల నాణ్యత నిర్ధారణకు ఉచితంగా పరీక్ష



అన్నమయ్య జిల్లా రాయచోటిలో పరీక్షల నిర్వహణకు సిద్ధంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ ల్యాబ్

రాయచోటి : భూమిలో దమ్ము ఉండి విత్తనం మంచిదైతే.. పంట బాగుంటుంది. పంట కళకళలాడితే.. దిగుబడికి దిగులుండదు.. దిగుబడి, ధరలూ బాగుంటే ఇక రైతన్న మోము, కుటుంబసభ్యుల్లో ఆనందం తొణికిసలాడుతుంది. ఇలా సవ్యంగా జరగాలంటే ముందుగా భూమిలో సత్తువ శాతం తెలుసుకుని, మేలి రకం విత్తనం కావాలి. వ్యవసాయమే జీవనాధారమైన అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా వైఎస్సార్ అగ్రి ల్యాబ్స్ భరోసా కల్పిస్తున్నాయి. ఏటా రూ.వేల కోట్ల పెట్టుబడి మట్టి పాలు కాకుండా కాపాడుతున్నాయి. పైసా ఖర్చు లేకుండా ఇన్‌పుట్స్‌ను ముందుగానే పరీక్షించుకోవడం ద్వారా నాసిరకం బారి నపడకుండా ధైర్యంగా సాగు పనులు చేపడుతున్నామని రైతన్నలు ఆనందంగా చెబుతున్నారు.

- ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటవుతున్న వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్స్ నాణ్యత పరీక్షలతో రైతుకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఇప్పటికే జిల్లాలో రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, మదనపల్లె, తంబళ్లపల్లిలలో 5 కేంద్రాలు సేవలందిస్తుండగా కొద్ది నెలల్లోనే పీలేరు నియోజకవర్గంలోని ల్యాబ్ కూడా ప్రారంభానికి నోచుకోనుంది. రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే) ద్వారా సరఫరా చేసే ఇన్‌పుట్స్‌తో పాటు మార్కెట్లోకి వచ్చే ప్రతి ఇన్‌పుట్ శాంపిల్‌ను ఇక్కడ పరీక్షించుకునే సదుపాయం ఉండటం వల్ల రైతుల్లో నమ్మకం పెరుగుతోంది. సొంతంగా తయారు చేసుకున్న విత్తనమైనా, మార్కెట్లో కొనుగోలు చేసినవైనా నేరుగా ఈ ల్యాబ్‌కు వెళ్లి నాణ్యతను ఉచితంగా పరీక్షించుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. విత్తనమే కాకుండా ఎరువులు, పురుగుమందుల నాణ్యతను కూడా పరీక్షించుకుని ధీమాగా సాగు పనులు చేపట్టవచ్చు. ఇప్పటికే ఆర్‌బీకేలతో చాలా సేవలు రైతులకు సులువుగా చేరువయ్యాయి. ఇప్పుడు ఈ ఇంట్రిగేటెడ్ ల్యాబ్‌లతో వ్యవ'సాయం' మరింత సులువు కానుంది.

ప్రతి ల్యాబ్‌లో ఆటోమేషన్: నమూనాల పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్ (ఇన్‌సైట్) అభివృద్ధి చేశారు. ఫలితాలను ట్యాంపర్ చేసేందుకు వీల్లేని రీలలో ప్రతి లేబరేటరీలో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటి రికార్డు కావడంతో పాటు ఫలితాలు ఆటోమేటిక్‌గా సిస్టమ్‌లో నమోదవుతాయి. ఏ ల్యాబ్‌లో ఏ బ్యాచ్ శాంపిల్‌ను ఏ సమయంలో పరీక్షించారో నిర్ధారిస్తూ ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా ఈ టెక్నాలజీ నమోదు చేస్తుంది. రైతు షాపుకెళ్లినపుడు బ్యాచ్ నంబర్ చెక్ చేసుకుంటే చాలు నాణ్యత సర్టిఫికెట్ ఉందో లేదో తెలిసిపోతుంది. జిల్లా ల్యాబ్‌లో గ్రో అవుట్ టెస్టింగ్ ఫెసిలిటీ కూడా కల్పిస్తున్నారు. ఇక్కడ మొక్కల జనటిక్ ప్యూరిటీ టెస్టింగ్ కూడా చేస్తారు. నాలుగు కేటగిరీల్లో సేకరించిన నమూనాలను పరీక్షిస్తారు. రైతులు తెచ్చే నమూనాలకు ఎలాంటి రుసుము వసూలు చేయరు. ల్యాబ్‌లో విధులు నిర్వహించే ఏఓలు, ఏఈఓలు, ఏడీలకు జాతీయ ఇన్‌స్టిట్యూట్‌ల ద్వారా అత్యాధునిక శిక్షణ ఇచ్చారు. ఇంటిగ్రేటెడ్ ల్యాబ్స్‌ను సమీప ఆర్బీకేలతో అనుసంధానిస్తున్నారు. ఇన్‌పుట్స్ పరీక్షించుకునేలా రైతులను ప్రోత్సహించేలా ఆర్బీకే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

ఎందుకీ ల్యాబ్‌లు?



- గతంలో ఎరువులు, విత్తనాల నాణ్యతా పరీక్షల కోసం ఇతర జిల్లాలకు పంపాల్సి వచ్చేది. అక్కడి నుంచి రిపోర్టు వచ్చేసరికి దాదాపుగా 30 నుంచి 45 రోజుల సమయం పట్టేది. దీంతో చాలా మంది రైతులు మార్కెట్లో కొన్న వాటిని పరీక్షించకుండానే వినియోగించి మోసపోయేవారు.
- ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లతో అలాంటి అవస్థలు ఇక ఉండవు.
- విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నాణ్యతతో పాటు ఆక్వా సాగు చేసే రైతులు కూడా తాము చేపల సాగుకు వినియోగించే మట్టి, నీరు వంటివి ఇక్కడ పరీక్షించుకోవచ్చు. సీడ్, ఫీడ్ వంటి పరీక్షలు కూడా జరుగుతాయి.
- జిల్లాలో అధిక శాతం మంది వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ పైన కూడా ఆధారపడి జీవిస్తున్నారు. వీరు పశువులకు సంబంధించిన రక్తం, పేడ, వాటికి ఉండే రోగాలతో పాటు పాలు నాణ్యత వంటివి కూడా ఈ ల్యాబ్‌లలో పరీక్షించుకోవచ్చు.
- ఈ ల్యాబ్ పూర్తిగా వ్యవసాయ శాఖ ప్రాంతీయ వ్యవసాయ సంచాలకులు, ఇద్దరు వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో పనిచేస్తుంది.

మంచి పరిణామం



వ్యవసాయ రంగానికి అండగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయం. ఈ జిల్లాలో వ్యవసాయరంగంతో పాటు పాడి రంగాల్లో రైతులు అధారపడి జీవిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఆయా ప్రాంతాలను బట్టి ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం మంచి పరిణామం. – దామోదర్‌రెడ్డి, రైతు, పోనేటిపాలెం, మదనపల్లె మండలం

ఎంతో ఉపయోగం



వేరుశనగ విత్తనాన్ని రాయచోటిలోని ల్యాబ్‌లో పరీక్షించి చూసుకున్నా. బాగా మొలకెత్తుతుందని నిర్ధారణ కావడంతో సాగు చేశా. పంట బాగుంది. చాలా ఆనందంగా ఉంది. ఈ ల్యాబ్‌లు రైతులకెంతో ఉపయోగం. – లక్ష్మిరెడ్డి, రైతు, ఎండపల్లి, రాయచోటి మండలం

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



గత సీజన్‌లో వాడగా మిగిలిన ఎరువుల నాణ్యతపై అనుమానం రావడంతో అగ్రిల్యాబ్‌లో పరీక్షించుకున్నా. నాణ్యత బాగుందని నిర్ధారణ కావడంతో ఎలాంటి సందేహం లేకుండా ధైర్యంగా వాడా. రైతులకు చేరువలో ఇంత అద్భుతమైన సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిన ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉంటారు. సీఎం సార్‌కు కృతజ్ఞతలు. – ప్రభాకర్‌రెడ్డి, రైతు, రెడ్డివారిపల్లె, నిమ్మనపల్లి మండలం

సత్వరం ఫలితాలు



అన్నమయ్య జిల్లాలో ఇప్పటికే ఐదు ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు సేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో చాలా ఆలస్యంగా పరీక్షల ఫలితాలు వచ్చేవి. ఇప్పుడు ల్యాబ్‌లు విరివిగా ఏర్పాటు చేయడం వల్ల ఆ సమస్య ఎదురుకాదు. ఎప్పటికప్పుడు ఫలితాలు రావడం వల్ల రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వాడటానికి వీలు పడుతుంది. – చంద్రానాయక్, అన్నమయ్య జిల్లా వ్యవసాయ అధికారి

శాశ్వత వ్యవస్థ.. సీఎం సంకల్పం..



రైతులకు నాణ్యమైన ఇన్‌పుట్స్ ఇవ్వడానికి శాశ్వతంగా ఓ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లను తీసుకొచ్చాం. జిల్లాలో మొత్తం ఆరింటిలో ఐదు వినియోగంలో ఉన్నాయి. మరొకటి పురోగతి నిర్మాణం దశలో ఉంది. – గిరీషా పీఎస్, జిల్లా కలెక్టర్

జోహార్.. గద్దర్

- మదనపల్లెలో ప్రజా యుద్ధనౌక
- రాజ్యాంగరక్షణ సభల్లో పాల్గొన్న ప్రజాగాయకులు
- గద్దర్ మృతిపై పలువురి సంతాపం



మదనపల్లెలో జరిగిన రాజ్యాంగరక్షణ సభలో పాల్గొన్న ప్రజాయుద్ధనౌక గద్దర్ (ఫైల్)

మదనపల్లె: ప్రజా యుద్ధనౌక, ప్రజాగాయకుడు గద్దర్‌కు మదనపల్లెతో విడదీయరాని అనుబంధం ఉంది. పట్టణంలో భారతీయ అంబేడ్కర్ సేన ఆధ్వర్యంలో ఐదేళ్ల క్రితం జరిగిన రాజ్యాంగ రక్షణ సభ, విడుదలై చిరుతైగల్ కట్చి(వీసీకే పార్టీ) ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ 8న జరిగిన రాజ్యాంగరక్షణ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గతంలో జరిగిన మునికృష్ణారెడ్డి అవార్డుల ప్రదాన సభలోనూ పాల్గొన్నారు. పట్టణానికి చెందిన బాస్ వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్, ఇతర ప్రజా సంఘాల నాయకులు, మేధావులు, విద్యావంతులతో ఆయనకు వ్యక్తిగత పరిచయాలున్నాయి. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు గుమ్మడి విఠల్ రావు అలియాస్ గద్దర్(77) కన్నుమూశారన్న వార్త తెలిసిన వెంటనే పట్టణం శోకసంద్రంలో మునిగిపోయింది. పట్టణంలో ఆయన పాల్గొన్న సభలకు హాజరైనవారు, ఆయన పాటలను, కళాప్రదర్శనలు చూసినవారు అప్పటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుని ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో తన పాటతో ఎంతోమందిని ఉత్తేజపరిచి.. ఉద్యమం ఉధృతం కావడానికి ఊపిరి పోసిన గద్దర్... మదనపల్లెలో జరిగిన రెండు రాజ్యాంగరక్షణ సభలోనూ తనదైన శైలిలో ఆటపాటలతో ప్రజలను అలరించారు. రాజ్యాంగం విశిష్టతను తెలుపుతూ, సమాజంలో వేళ్లానుకుపోయిన నిచ్చెనమెట్లు, అస్పృశ్యతలపై తానే అభినయిస్తూ.. తన గొంతుకతో స్థానికుల్లో ఉద్యమస్ఫూర్తిని నింపారు. వీసీకే పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రథమ మహాసభలో భాగంగా ఏప్రిల్ 8న మదనపల్లెలో నిర్వహించిన సమావేశంలో గద్దర్, విమల దంపతులు సన్మానంతో పాటు డాక్టర్.బి.ఆర్. అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి స్మారక సత్కారాలను అందుకున్నారు. ప్రజాగాయకుడు గద్దర్ మృతిపై సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రగాఢ సంతాపం తెలిపారు. జానపద కళారూపాలకు విప్లవ సాహిత్యాన్ని జోడించి ప్రజా సంస్కృతికి పట్టం కట్టారన్నారు. గద్దర్ మృతి అభ్యుదయ, సాహిత్య లోకానికి, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు అని అన్నారు. కుటుంబసభ్యులకు సానుభూతిని తెలిపారు.

పంచాయతీ ఎన్నికలకు నగారా

రాయచోటి/బి.కొత్తకోట: గ్రామ పంచాయతీలు వార్డు మెంబర్లకు జరగాల్సిన ఉప ఎన్నికల నగరా మోగింది. ఈ నెల 8వ తేదీన నామినేషన్లు వేయడానికి ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారు. 19న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి పేర్కొన్నారు.

- రాజంపేట రూరల్ మండలం ఆకేపాడు, పెద్దమండెం మండలం గుర్రంవాండ్లపల్లె పంచాయతీలకు సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే నందలూరు మండలం లేబాక 3వ వార్డు, పాటూరు 1, 10, వీరబల్లి మండలం సంఘంవాండ్లపల్లి 10, రాజంపేట రూరల్ మండలం ఎంజి పురం 7, గుండ్లూరు 3, గాలివీడు మండలం గాలివీడు 5, 10, లక్కిరెడ్డిపల్లె పంచాయతీలో 2, రామాపురం మండలం గువ్వలచెరువులో 8, సంబేపల్లె మండలం మోటకట్లలో 4, పీఎం కాలనీలో 8, రాయచోటి రూరల్ మండలం శిబ్యాలలో 12, పెనగలూరు మండలం ఎన్ఆర్ పురం 3, కెవి పల్లి మండలం తువ్వపల్లిలో 5, వాల్మీకిపురం మండలం గండబోయినపల్లిలో 7, మాధవరం పల్లి 4, మదనపల్లి రూరల్ మండల పరిధిలోని కోతవారిపల్లిలో 1, పాన్నేటిపాలెంలో 4, పెంచుపాడు 2, రామసముద్రం 11, రాగిమాకులపల్లి 1, ఎలవ నెల్లూరు 2, ఆర్.నడింపల్లి 4, ఓబులవారిపల్లి మండలం బొట్టిమేడిపల్లి 3, రాళ్లచెరువుపల్లి 8, బిపి రాజపల్లి 8, రైల్వే కోడూరు మండలం ఓబనపల్లి 4, బొజ్జవారిపల్లి 3, సెట్టిగుంట 13, పెద్దమండెం మండలం వెలిగల్లులో 6, పుల్లంపేట మండలం వత్తలూరు 7, అప్పయ్యరాజుపేట 5, పోతనవారిపల్లి 1, రంగపల్లి 8, కోనయ్యగారిపల్లి 6, కలకడ మండలం కలకడలో 1, నడిమిచర్ల 6 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.

స్పోర్ట్స్ హబ్‌గా కడప

- మేయర్ కె. సురేష్‌బాబు
- ముగిసిన ఏపీ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్
- రాణించిన కడప క్రీడాకారులు



టోర్నమెంట్ చాంపియన్‌లుగా నిలిచిన క్రీడాకారులతో కడప మేయర్ సురేష్‌బాబు తదితరులు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని పి.వి.ఆర్. స్పోర్ట్స్ ఎరీనాలో ఈనెల 3 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఉత్సాహంగా సాగింది. ఆదివారం సాయంత్రం టోర్నమెంట్ ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కడప నగర మేయర్ కె.సురేష్‌బాబు మాట్లాడుతూ కడపను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామన్నారు. జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణిస్తున్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా స్పోర్ట్స్ రిజర్వేషన్ తీసుకువచ్చి వేలాదిమంది క్రీడాకారులకు ఉద్యోగాలు లభించాయన్నారు. కడపలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇండోర్ స్టేడియం నిర్మించామన్నారు. మరో స్టేడియం కడప నగరంలో ఏర్పాటు చేయడం క్రీడాకారులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే క్రీడల్లో రాణించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. విద్యాసంస్థల్లో సైతం క్రీడలను తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏపీ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి అంకమ్మచౌదరి, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. జిలానీబాషా మాట్లాడారు. అనంతరం విజేతలకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

విజేతల వివరాలు.. (విన్నర్స్.. రన్నర్స్)

మిక్స్‌డ్ డబుల్స్: అబ్దుల్ రెహమాన్(కడప)–ఎల్. మమైక్య (కృష్ణ), కె. సాయిపవన్ (తూ.గో)–రష్మిత (కృష్ణ).

మహిళల సింగిల్స్: నవ్య కందేరి (కడప), టి. సూర్యచరిష్మ (కృష్ణ).

పురుషుల సింగిల్స్ : కె.సాయిచరణ్ (గుంటూరు), ఎ. వెంకటసాయి హిమదీప్ (ప్రకాశం).

మహిళల డబుల్స్: టి.సూర్యచరిష్మ–ఎల్.మమైక్య(కృష్ణ), డి. స్రవంతి–డి.దీపిక (గుంటూరు).

పురుషుల డబుల్స్: పి. చంద్రగోపీనాథ్ (గుంటూరు)–కె.సాయిపవన్ (తూ.గో), కె.సాయిరామ్–ఎ. గుణశ్రీకర్ (పశ్చిమగోదావరి).

నేతన్నకు ఊపిరి

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మారిన బతుకులు
- గతంలో చేనేత కార్మికులను పట్టించుకోని టీడీపీ
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

సాక్షి రాయచోటి : ఒకప్పుడు నిరాదరణకు గురై ఆత్మహత్యల వైపు పయనించిన నేతన్న ప్రస్తుతం ధైర్యంగా ముందుకెళుతున్నాడు. చేనేత ద్వారా వస్త్ర వ్యాపార రంగంలో ముందుకెళ్లేవారు కొందరైతే.. ప్రత్యేకంగా చేనేతను పండిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నవారు మరికొందరు.. టీడీపీ హయాంలో చేనేత కార్మికులను, మగ్గాలను పట్టించుకోక వారికి చేయూతనందించకపోవడంతో అనేక మంది కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అయితే 2019లో వైఎస్ జగన్ సర్కార్ రాష్ట్రంలో కొలువు తీరగానే నేతన్నలకు అండగా నిలుస్తోంది.

ప్రతి ఏడాది నేతన్న నేస్తం

వ్యవసాయాన్ని నమ్ముకుని జీవించే రైతన్నల తర్వాత అధికంగా జిల్లాలో నేతన్నలు ఉన్నారు. ప్రధానంగా మదనపల్లె, తంబళ్లపల్లె, రాజంపేటలతోపాటు మాధవరం లాంటి ప్రాంతాలు ప్రత్యేక గుర్తింపు వచ్చాయి. చేనేత పరంగా తయారైన వస్త్రాలు కూడా మదనపల్లె, మాధవరం ఇతర ప్రాంతాల్లో పెద్ద షోరూంలలో లభిస్తున్నాయి. పవర్ లూమ్స్, హ్యాండ్ లూమ్స్ జిల్లాలో భారీ ఎత్తున ఉన్నాయి. నేతన్నను ఆదుకోవడంలో భాగంగా ప్రతి ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక్కో చేనేత కార్మికుడికి సుమారు రూ.24వేల చొప్పున అందిస్తూ వస్తోంది. అన్నమయ్య జిల్లాలో మూడేళ్లుగా ఒక్కో దఫాకు రూ.14కోట్ల నుంచి రూ.16కోట్ల మేర డబ్బులు అందిస్తూ వచ్చారు. అలాగే బ్యాంకుల ద్వారా ముద్ర రుణాలు కూడా సుమారు రూ.10కోట్ల మేర కార్మికులకు అందించారు. అలాగే 50ఏళ్లు దాటిన కార్మికులకు పింఛన్‌ను కూడా ప్రభుత్వం అందిస్తోంది.



మారుతున్న చేనేత బతుకులు :

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాతోపాటు అన్నమయ్య జిల్లాలోనూ చేనేత కుటుంబాలలో బతుకులు ఇప్పుడిప్పుడే మారుతున్నాయి. ప్రభుత్వం ఆర్థికంగా సహాయం అందించడంతో పాటు మగ్గం దారులకు అనేక సబ్సిడీ అందిస్తూ ఆపదలో అండగా నిలుస్తున్నాయి. వారు కూడా కొంత మేర స్వయంశక్తితో రూపొందించిన వస్త్రాలను మార్కెట్‌కు పంపిస్తూ ఇప్పుడిప్పుడే ఆర్థికాభివృద్ధి వైపు పయనిస్తున్నారు.

నేడు చేనేత దినోత్సవం ర్యాలీ

రాయచోటి: నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం నుంచి మహాత్మ గాంధీ విగ్రహం మీదుగా ఆర్టీసీ బస్టాండు వద్ద గల ఎన్‌జీఓ హోం వరకు చేనేత వాక్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అనంతరం రాయచోటి ఆర్టీసీ బస్టాండు వద్ద గల ఎన్‌జీఓ హోం మీటింగ్ హాలులో చేనేత దినోత్సవ సభ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా నైపుణ్యత కలిగిన ఇద్దరు సీనియర్ చేనేత కార్మికులను సత్కరించనున్నట్లు చెప్పారు.

ప్రభుత్వం ఆదుకుంటోంది

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా కార్మికులను ఆదుకుంటోంది. వారికి సరైన సమయంలోనే ఒక్కో కార్మికుడికి రూ.24వేల చొప్పున అందిస్తూ అండగా నిలబడుతోంది. మగ్గాలు ఉన్న కార్మికులు ఆర్థికాభివృద్ధి సాధించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వరుసగా మూడేళ్లుగా ప్రభుత్వం నేతన్న నేస్తం కింద లబ్ధిదారు లకు పెద్ద ఎత్తున సొమ్ములను అందించారు. –పీఎస్ గిరీషా జిల్లా కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించారు. రామసముద్రం మండలం దిగువపల్లెకు చెందిన రైతు నీరుగట్టి శ్రీనివాసులు(50) శనివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలిస్తుండగా, గ్రామానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో పడి ఉన్నాడని సమాచారం అందడంతో అక్కడికి వెళ్లారు. పురుగుల నివారణ మందు తాగి స్పృహలేని స్థితిలో పడి ఉన్న అతడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇటీవల వివిధ పంటల సాగుకై రూ.10 లక్షల మేర అప్పులు చేశాడని, వడ్డీలు పెరగడంతో ఆత్మహత్యకు ప్రయత్నించి ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక వైద్యులు చికిత్సలు అందించారు. అవుట్‌పోస్ట్ సిబ్బంది రామసముద్రం పోలీసులకు సమాచారం అందించారు. అలాగే.. మదనపల్లె మండలం బసినికొండకు చెందిన మహమ్మద్‌వలీ కుటుంబ సమస్యలతో ఆదివారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నూనె మళ్లీ వాడకంపై జరిమానా

రాయచోటి : వాడిన నూనెను మళ్లీ వాడిన హోటల్ యజమానులకు రూ.32 వేల జరిమానా విధిస్తూ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తీర్పు వెలువరించారు. అన్నమయ్య జిల్లా జేసీ కోర్టులో శనివారం.. వ్యాపారులు వంట నూనెలను మళ్లీ ఉపయోగించడం వల్ల కలిగే దుష్ప్రభావాలపై జేసీ తీవ్రంగా స్పందించారు. జిల్లా ఆహార భద్రతాధికారి కె.షమీమ్ బాష ఫిర్యాదు మేరకు ఈ శిక్షను విధించారు. వంట నూనెలను మళ్లీ ఉపయోగించి తయారు చేసిన వంటల వల్ల మనుషులలో చెడు కొలస్ట్రాల్‌గా మారుతుందన్నారు. దీంతో తయారైన ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల జీర్ణకోశ, గుండె సంబంధిత, క్యాన్సర్ లాంటి వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు. 2006 వ్యాపారస్తులు ఇలాంటి నూనెను వినియోగిస్తే ఆహార భద్రతా ప్రమాణాల చట్టం ప్రకారం రూ.2 లక్షల వరకు అపరాధ రుసుం విధించవచ్చని జిల్లా ఆహార భద్రతాధికారి హోటల్ యజమానులను ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

కాసులు కురిపించే డ్రాగన్‌ఫ్రూట్

- పంట పండించిన గుంటూరు జిల్లా రైతులు
- మార్కెట్‌లో అధిక ధర
- పండులో ఔషధ గుణాలు మెండు



పంట దిగుబడికి వచ్చిన డ్రాగన్‌ఫ్రూట్ మొక్కలు



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న పింక్ టు పింక్ డ్రాగన్ ఫ్రూట్స్

ములకలచెరువు : విదేశాల్లో సంపన్నులు తినే డ్రాగన్ ఫ్రూట్స్ మన ప్రాంతంలో ఇటీవల కనిపిస్తున్నాయి. అలాంటి అరుదైన పంటను ములకలచెరువు మండలంలో సాగుచేస్తున్నారు. అధిక ఆదాయం ఆర్జిస్తున్నారు. సంప్రదాయ పంటలకు భిన్నంగా పండ్ల తోటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన రైతులు ప్రదీప్, భాస్కర్ రావు ప్రయోగాత్మకంగా పండించి విజయం సాధించారు. వీరు ములకలచెరువు మండలంలోని ఏనువారిపల్లె సమీపంలో 20 ఎకరాల భూమిని కొనుగోలు చేసి 12 ఎకరాల్లో రెండేళ్లుగా పంటను పండించి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఈ ప్రాంతంలో విస్తారంగా సాగు చేయవచ్చని వారు చెబుతున్నారు.

అన్ని నేలలు అనుకూలం

డ్రాగన్‌ఫ్రూట్స్ మొక్కల సాగుకు అన్ని రకాల నేలలు అనుకూలం. మంచి సేంద్రియ కర్బనంతో కూడిన ఇసుక నేలలు మరింత శ్రేష్ఠం. అధికంగా వియత్నాం, థాయ్‌లాండ్, ఇజ్రాయిల్, శ్రీలంక వంటి విదేశాల్లో పండిస్తున్నారు. నీటి అవసరం చాలా తక్కువ. పూత, కాయ సమయాల్లో 3-4 తడులు అందించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ పంట పండించుటకు, మొక్కల ఎదుగుదలకు ఊతం అనేది అతి ప్రధానమైనది. సిమెంట్/కాంక్రీట్ స్తంభాలు ఎకరానికి 500 వరకు అవసరమవుతాయి. ప్రతి స్తంభానికి నాలుగు వైపులా నాలుగు మొక్కలను నాటాలి. స్తంభానికి పైన టైర్/ఇనుప చక్రం ఉంచాలి. ఇవి మొక్క నుంచి వచ్చిన కొమ్మలు విరిగిపోకుండా, జారిపోకుండా ఊతం అందిస్తాయి. ఎకరానికి సుమారుగా 2,000 మొక్కలు నాటాలి.

తక్కువ ఖర్చు.. ఎక్కువ దిగుబడి

డ్రాగన్‌ఫ్రూట్ పంట ప్రారంభంలో ఎకరా విస్తీర్ణంలో సాగు చేయడానికి రూ.5 లక్షలు ఖర్చుచేయాలి. ఒకటిన్నర సంవత్సరానికి పంట దిగుబడి వస్తుంది. తర్వాత ప్రతి ఏడాదికి రూ.50 వేలు ఖర్చవుతుంది. మొదటిసారి దిగుబడి 2 నుంచి 4 టన్నులు వస్తుంది. రెండో ఏడాది 6 నుంచి 8 టన్నులకు పెరుగుతుంది. తక్కువ ఖర్చు దిగుబడి ఎక్కువ. వైరస్, పురుగుల బెడద ఉండదు.

20 ఏళ్ల వరకు దిగుబడి

ఈ పంట ఒకసారి నాటితే 20 ఏళ్ల వరకు దిగుబడినిస్తుంది. ఏడాదిలో రెండు సార్లు (జూన్, జనవరిలో) పశువుల ఎరువు వేసి సూక్ష్మపోషకాల మిశ్రమాన్ని పిచికారీ చేయాలి. పూత, కాయ సీజన్ జూన్ నుంచి అక్టోబర్ నెల వరకు ఉంటుంది. పంట పొలంలో విద్యుత్ లైట్లను అమర్చితే వేసవిలో కూడా పంటను పొందవచ్చు.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

డ్రాగన్‌ఫ్రూట్ కిలో రూ.120 నుంచి రూ. 200కు పైగా కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. ఇక్కడి నుంచి బెంగుళూరు, కేరళ, చెన్నై, విజయవాడ, హైదరాబాద్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. ఇక్కడ పింక్ టు పింక్ రకం సాగు చేస్తున్నారు.

ఈ పండు తింటే ఆరోగ్యం

ఈ పండు దక్షిణ అమెరికాలో పుట్టింది. ఈ మొక్కను తెలుగులో సిరి జమ్మడ మొక్క అంటారు. ఇది ఎడారి జాతికి చెందిన పండ్ల మొక్క. డ్రాగన్ ఫ్రూట్‌లో యాంటీ యాక్సిడెంట్లు, విటమిన్‌తోపాటు ఐరన్, మెగ్నీషియం, మినరల్స్ ఉంటాయి. ప్లేట్ లైట్స్ పడిపోయిన సమయంలో ఈ పండు తింటే ఆరోగ్యంగా ఉంటారు. బరువు నియంత్రణ, అస్తమా, చెడు కొలెస్ట్రాల్ తగ్గడం, డయాబెటీస్ లాంటి వ్యాధుల బారిన పడకుండా చేస్తుందని వైద్యులు చెబుతున్నారు.

ఇక్కడి రైతులు ఆసక్తి చూపుతున్నారు

గుంటూరు జిల్లాకు చెందిన రైతులు డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు చేసి విజయవంతం కావడంతో ఇక్కడి రైతులు కూడా ఆసక్తి చూపుతున్నారు. పీటీయం మండలం కాట్నగల్లు, ములకలచెరువు మండలంలో సోంపల్లిలో కొత్తగా పంట సాగు చేశారు. పంటపైన రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు మన జిల్లా నేలలు, వాతావరణం అనుకూలం.

-ఎస్.భీమేశ్వర్, హార్టికల్చర్ అధికారి, ములకలచెరువు

బస్సులో జేబుదొంగల చేతివాటం

పోరుమామిళ్ల : స్థానిక ఆర్టీసీ బస్టాండులోని బస్సులో ఆదివారం మధ్యాహ్నం జేబుదొంగలు చేతివాటం చూపారు. బద్వేలు డిపోకు చెందిన పామూరు వెళ్లే బస్సు బస్టాండులోకి రావడంతో మహిళలు ఒక్కసారిగా లోపలకు ఎక్కేందుకు ఎగబడ్డారు. అదే అదనుగా దొంగలు పర్సులు దోచుకున్నారు. ప్రకాశం జిల్లా సి.యస్.పురం మండలం కంభంపాడుకు చెందిన మహిళ కట్టెలబ్యాగులోని పర్సు కొట్టేశారు. అలాగే పోరుమామిళ్లకు చెందిన ఓ మహిళ చేతిసంచిలోని పర్సు కొట్టేశారు. బస్సు ఎక్కాక సంచుల్లో పర్సులు లేకపోవడంతో వారు లబోదిబోమంటూ కిందికి దిగారు. తన పర్సులో కమ్మలు, హారం, కాళ్లగొలుసులు, మెట్టెలు, డబ్బు తదితర విలువైన వస్తువులు ఉన్నాయని, అన్నీ దోచుకున్నారని కంభంపాడుకు చెందిన మహిళ కన్నీటిపర్యంతమైంది. పోయిన పర్సులో రూ.700 నగదు, సెల్‌ఫోన్ ఉన్నాయని పోరుమామిళ్ల మహిళ వాపోయింది. గమనించిన కంట్రోలర్ పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి కంభంపాడు మహిళను స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా.. విచారణ చేస్తున్నామన్నారు. పోరుమామిళ్ల మహిళ ఎవరో తెలియదని, స్టేషన్‌కు ఒక్క మహిళ మాత్రమే వచ్చిందని చెప్పారు. బస్సు ప్రయాణికుల జేబులు, పర్సులు కొట్టేసే వారు ఇటీవల తగ్గారని భావిస్తున్న తరుణంలో మళ్లీ ఈ సంఘటనలు జరగడంతో ప్రజలు భయపడుతున్నారు.

అటవీ శాఖలో ఖాళీలు భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

బి.కొత్తకోట : రాష్ట్ర అటవీ శాఖలో 2 వేలకుపైగా ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసులు కోరారు. బి.కొత్తకోట మండలం పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఆదివారం ఆ సంఘం రాయలసీమ జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అడవులు, వన్యప్రాణులు, అటవీ భూముల సంరక్షకు సిబ్బంది కొరత పీడిస్తోందన్నారు. బీటు అధికారి నుంచి డీఎఫ్ఓ వరకు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు చెప్పారు. చాలా కాలంగా పదోన్నతులు జరగలేదని, దీనిపై చర్యలు తీసుకుని అడహక్ పదోన్నతులు కల్పించాలని కోరారు. అనంతరం కొండపై ప్రకృతి అధ్యయన కేంద్రంలో తొమ్మిది జిల్లాలకు చెందిన కార్యవర్గ సభ్యులకు సమావేశం నిర్వహించారు. సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శశిభూషణ్‌యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి విమల్, కోశాధికారి కె.సురేష్, జిల్లాల అధ్యక్షులు కె.ప్రతాప్, కార్యదర్శి సుధాకర్ (అన్నమయ్య), ఎం.మల్లికార్జున (అనంతపురం) ఎస్.పిచ్చిరెడ్డి (నెల్లూరు), డి.నాగరాజు (కడప), సి.విజయభాస్కర్‌రెడ్డి (కర్నూలు), ఓ.రేష్మిరెడ్డి (నంద్యాల), సయ్యద్ మగ్బూల్ (ఆత్మకూరు), ఎం.జనార్దన్(రాజంపేట), చినబాబు(తిరుపతి) పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



లక్ష్మీదేవి (ఫైల్)

పెనగలూరు : మండలంలోని కొండూరు దళితవాడకు చెందిన పూలతోట లక్ష్మీదేవి(30) శనివారం అదృశ్యమైంది. ఏఎస్‌ఐ మల్లికార్జున తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లక్ష్మీదేవికి పుట్టుకతోనే మూగ, చెవుడు ఉన్నాయి. కొండూరు దళితవాడలోని పూలతోట హరికృష్ణతో వివాహమైంది. ఈ నెల 5న మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లింది. చుట్టు పక్కల గ్రామాలలో ఉన్న బంధువులను ఆమె భర్త, తల్లిదండ్రులు విచారణ చేసినా కనిపించలేదు. ఈ క్రమంలో శనివారం రాత్రి 10 గంటలకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్‌ఐ సెల్ నంబరు : 9121100575కు సమాచారం అందించాలని ఏఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : నందలూరు మండలం చింతలకుంట గ్రామానికి చెందిన పప్పు వెన్నెల కుటుంబానికి ప్రభుత్వం రూ.8 లక్షలు మంజూరు చేసింది. ఓబులవారిపల్లె మండలం కడప-రేణిగుంట జాతీయ రహదారిలోని చిన్నఓరంపాడు వద్ద గత నెలలో బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో వెన్నెల తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రభుత్వం ప్రకటించిన ప్రకారం ఎక్స్‌గ్రేషియా మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన చెక్కును ఆదివారం మేడా భవన్‌లో మృతురాలి తండ్రి రామచంద్రారెడ్డికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్సు ప్రమాదంలో గాయపడిన వారికి, మృతి చెందిన వారి కుటుంబాలకు వెనువెంటనే ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందన్నారు. ఆడపూరు గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మకు రూ.2 లక్షలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పొలగిరి మల్లికార్జునరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ రామ్మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, నందలూరు ఆర్‌ఐ సుశీల్ తదితరులు పాల్గొన్నారు.

భూమనతో అన్నమయ్య జన్మస్థలికి మరింత శోభ

ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి నియామకంతో అన్నమయ్య జన్మస్థలి మరింత శోభ సంతరించుకుంటుందని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంత్యుత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్ర పండుగగా చేయాలని కోరారు. అన్నమయ్య థీంపార్కు, తాళ్లపాక గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.

ఒంటిమిట్ట కోదండ రామాలయం, నందలూరు సౌమ్యనాథాలయం, అన్నమయ్య 108 అడుగుల విగ్రహ ప్రాంతాన్ని సమాంతరంగా అభివృద్ధి చేస్తే రాష్ట్ర స్థాయిలో ఆధ్యాత్మిక ప్రాంతాలుగా గుర్తింపునకు నోచుకుంటాయన్నారు. ఈ ప్రాంతాలకు సుపరిచితుడైన భూమన టీటీడీ చైర్మన్‌గా కావడం హర్షణీయమన్నారు. ప్రత్యేకంగా సౌమ్యనాథాలయాన్ని అభివృద్ధి చేస్తారని నందలూరు వాసులు ఆశిస్తున్నారని వివరించారు.

హ్యాండ్‌బాల్ ఎంపికలకు విశేష స్పందన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పోతుల వెంకటరామిరెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ విభాగం ఎంపికలకు విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి విచ్చేసి ఈ ఎంపికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్.సమరనాథరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ, నిరంతర సాధన, క్రీడాస్ఫూర్తి విజేతలుగా నిలుపుతాయన్నారు. జియోన్ వ్యాయామ కళాశాల చైర్మన్ రాజారత్నం ఐజాక్ మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి క్రీడా సంఘాలు కృషి చేయాలని సూచించారు. ఏపీ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారుల అభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్న హ్యాండ్‌బాల్ సంఘం కృషిని అభినందించారు. జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సింధూరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 19, 20 తేదీల్లో ఒంగోలులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులకు శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అతిథులు క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడా ఎంపికలను ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు, కోశాధికారి రవీంద్రనాథ్, కె.సంజీవరెడ్డి, హ్యాండ్‌బాల్ శిక్షకుడు అబ్దుల్‌మునాఫ్, సీనియర్ క్రీడాకారులు సాయికిశోర్‌రెడ్డి, బసిరెడ్డి, పవన్ కుమార్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ : వ్యక్తి మృతి



మృతి చెందిన వెంకటరమణ

రాయచోటి టౌన్ : బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాయచోటి పట్టణంలోని చెక్‌పోస్టు దగ్గర విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా బారికేడ్లు దాటుకొని బైక్‌పై రోడ్డుపైకి వస్తుండగా.. చిత్తూరు రోడ్డు వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అదే ప్రాంతానికి చెందిన యం.వెంకటరమణ(48) తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో..




పవన్ మృతదేహం

మదనపల్లె : మండలంలోని మాలేపాడు గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. చిత్తురు జిల్లాలోని పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెకు చెందిన ఉల్లాడిపవన్(37) గత పదిహేనేళ్లుగా అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలం బండ్లపై పంచాయతీ జాంద్రబైలు గ్రామంలో నివాసం ఉంటూ బోరు రిపేరీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం మరో ముగ్గురితో కలిసి మదనపల్లె మండలం మాలేపాడు పంచాయతీలోని ప్రభుత్వ తాగునీటి బోరు రిపేరీ చేసేందుకు వెళ్లాడు. ఉదయం అల్పాహారం తీసుకుంటుండగా అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే సహచరులు ఆస్పత్రికి తరలించేందుకు సిద్ధమవుతుండగా, అప్పటికే స్పృహ తప్పి కిందపడిపోయాడు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ గణేష్ హుటాహుటిన అక్కడికి చేరుకోగా అప్పటికే పవన్ మృతి చెందాడు. జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకుని తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తాలూకా పోలీసులు పవన్ మృతికి సంబంధించి సహచరుల స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు హరీష్, జగదీష్, కుమార్తె మేఘన ఉన్నారు.

డ్రాగా ముగిసిన జోనల్ మ్యాచ్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన సెంట్రల్‌జోన్, సౌత్‌జోన్ జట్లు డ్రాగా ముగిసింది. చివరి రోజు ఆదివారం 324 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ జట్టు 108.1 ఓవర్లలో 463 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నయీముల్లా 62, సుతేజ్‌రెడ్డి 100 పరుగులు చేశారు. సెంట్రల్‌జోన్ బౌలర్ ఆదిత్యరెడ్డి 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన సెంట్రల్‌జోన్ జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39.3 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. జట్టులోని ఆనంద్ 53 పరుగులు చేశాడు. సౌత్‌జోన్ బౌలర్లు అర్జున్‌టెండూల్కర్ 1, ప్రదీప్‌రెడ్డి 1 వికెట్ తీశారు. దీంతో ఫలితం తేలకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా సౌత్‌జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 154 పరుగులు చేయగా, సెంట్రల్‌జోన్ జట్టు 311 పరుగులు చేసిన విషయం తెలిసిందే. దీంతో సెంట్రల్‌జోన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

చేనేతలను సత్కరించడం అభినందనీయం



చేనేత కార్మికురాలిని సత్కరిస్తున్న తొగటవీర క్షత్రియ సేవా సంఘం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని చేనేత కార్మికులను సత్కరించడం అభినందనీయమని తొగట వీర క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో 73 మంది చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత పెద్ద కుటీర పరిశ్రమైన చేనేత రంగం దేశ సంస్కృతి, వైభవాలకు ప్రాణం పోసిందన్నారు. ప్రభుత్వాలు చేనేత కార్మికులను ఆదుకొని, వారి సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు. చేనేత కార్మికుడి చిత్రంతో కూడిన ప్రత్యేక తపాలా బిళ్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం నాయకులు బండారు రఘురామయ్య, బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, గోవిందు నాగరాజు, బొమ్మల వెంకట రత్నం, సీఆర్‌ఐ సునీల్ జయంత్, నారాయణస్వామి, సుధాకర్, సుబ్బరాయిడు, లక్ష్మినారాయణ, చౌడం సూరిబాబు, వెంకట నారాయణ, నాగార్జున, డాక్టర్ పట్టెం ప్రత్యూష పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో రాణించిన రైతుబిడ్డ



ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ఇండియా, ఎమిరేట్స్ జట్లు



దిలీప్‌ను పతకంతో సత్కరిస్తున్న దుబాయ్ షేక్

పోరుమామిళ్ల : అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో వైఎస్సార్ జిల్లాకు చెందిన రైతు బిడ్డ రాణించాడు. దుబాయ్‌లో శనివారం ఇండియా, అరబ్ ఎమిరేట్స్‌కు జరిగిన ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ ఫైనల్ పోటీలో ఇండియా రెండో స్థానంలో నిలిచింది. అరబ్ ఎమిరేట్స్ గెలుపొందింది. ఈ పోటీల్లో పోరుమామిళ్ల మండలం యరసాల గ్రామానికి చెందిన రైతు బిడ్డ దిలీప్‌కుమార్‌రెడ్డి సత్తా చాటాడు. జట్టులో కీలకపాత్ర పోషించాడు. దిలీప్‌కుమార్‌రెడ్డి నెల్లూరులో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ అక్కడే చిట్టిబాబు అకాడమీలో ఫుట్‌బాల్ క్రీడలో కోచింగ్ తీసుకున్నాడు. 2023 మే 26, 27, 28 తేదీల్లో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ (యస్‌బీకేఎఫ్) ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ద్వితీయ స్థానం లభించింది. అండర్-19 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో 13 రాష్ట్రాలు పాల్గొన్నాయి. ఆ పోటీల్లో దిలీప్‌కుమార్‌రెడ్డి చక్కని ప్రతిభ చూపి, జాతీయ జట్టులో స్థానం సంపాదించాడు. జూలై 30 నుంచి ఆగస్టు 5 వరకు దుబాయ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ పోటీల్లో పాకిస్తాన్, శ్రీలంక, మాల్దీవులు, కెన్యా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండియా పాల్గొన్నాయి.

ఇండియా, అరబ్ ఎమిరేట్స్ ఫైనల్‌కు వచ్చాయి. శనివారం రెండు జట్లు ఫైనల్లో తలపడగా ఇండియా సెకండ్ ప్లేస్‌లో నిలిచింది. ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ క్రీడలో కడప జిల్లా రైతు బిడ్డ ప్రతిభ చూపడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. దిలీప్ తండ్రి శేఖర్‌బాబురెడ్డి యరసాలకు చెందిన సామాన్య రైతు. రైతు బిడ్డగా ఫుట్‌బాల్ క్రీడలో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం రాష్ట్రానికే గర్వకారణమని చెప్పవచ్చు. ముఖ్యంగా కడప జిల్లా యువకుడు దుబాయ్‌లో సత్తా చూపడంపై అందరూ గర్వపడాలి.